
# ఎడారి కోయిలా

తుషారా



'ప్రేమ మహోన్నతమైన వరం
సుమధురమైన ఆ ప్రేమా
మృతా రసా స్వాదనలో
జీవితాలు వికసిస్తాయి'

ప్రతి మనిషికి ఒక మనసుంటుంది. మనసంటె ఏమిటో అసలు మనసనేది ఎలా ఉంటుందో కొందరు మనుషులకె అర్ధమవుతుంది.

మరి కొందరికి మనసున్నా ప్రయోజనం లేదు. మనసులో ఎన్నో లోతులు

మరెన్నో విచిత్రాలు

మనసు పలికే భాషలు, భావాలు ఎన్నో ఎన్నెన్నో.

సముద్ర తీరం.

చల్లటి సాయంకాలం వేళ. భయంకరాన్ని సృష్టించేందుకు ఎగిసి వొడ్డుకు వచ్చే కెరటాలు తిరిగి ప్రశాంతంగా నెమ్మదిగా వెనక్కి వెళ్ళిపోతున్నాయి.

ఆ సముద్ర తీరంగా ఓ పడుచు జంట ఒకరి చేతిని ఒకరు వొడిసి పట్టుకొని నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్తున్నారు.

సముద్రపు కెరటాలు వాళ్ళ కాళ్ళని సుతారంగా తాకి అర్థం కాని భాషలో వాళ్ళని పలకరిస్తుంటె వాళ్ళు పులకరించి పోతున్నారు.

వాళ్ళిద్దరూ అలా కొంతదూరం నడిచి ఓ చోట కూర్చున్నారు. ఆ ఇద్దరి కళ్ళల్లో ఏదో తెలియని దిగులు కనిపిస్తుంది.

సముద్రం ఘోషపెడుతుంది.

చల్లగాలి మెల్లగా అల్లరి పెడుతుంది.

అయినా వాళ్ళ మధ్య మౌనం నిశ్శబ్దంగా తాండవిస్తుంది.

కొంతసేపటి తర్వాత అతను ఆమె కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు.

"స్వప్న వెళ్ళక తప్పదా?"

ఆమె "ఊఁ....." అని అతని బాధని అర్థం చేసుకుంటూ.

"నిన్ను వొదిలి నేనూ ఉండలేనని తెలుసుగా చందూ! అయినా ఎన్ని రోజులు పదిహేను రోజులేగా వాలుతాను సరేనా" అంది.

అతను ఓ నిట్టూర్పు విడుస్తూ

"పదిహేను రోజులు! అంటె మూడు వందల అరవై గంటలు!! ఇలాంటివి ఎన్నివేల నిట్టూర్పులు విడుస్తూ గడపాలో" అన్నాడు.

అతను అన్న తీరు చూసి స్వప్న చిన్నగా నవ్వింది.

అలా కొంతసేపు కూర్చుని ఇద్దరూ లేచి సముద్ర తీరం గుండా నడుచుకుంటూ వెళ్ళసాగారు.

సముద్రానికి మాత్రం వాళ్ళు వెళ్ళటం ఇష్టం లేదన్నట్టు ఓ కెరటాన్ని బలంగా వాళ్ళ కాళ్ళని తాకించింది.

చందూ గేటు తీసుకొని ఇంట్లోకి రావటం చూసి వరండాలో అతని కోసమే ఎదురు చూస్తున్న చందూ అన్నయ్య చందుకి ఎదరు వెళుతూ...

"ఏరా ఇంతసేపు ఎక్కడికెళ్ళావు అమ్మకి హార్ట్ ఎటాక్ వచ్చింది హాస్పిటల్‌కి తీసుకెళ్ళాము త్వరగా పదా" అన్నాడు చందూని తొందరపెడుతూ...

ఆ మాటల్ని విన్న చందూకి ఒక్కసారిగా చెమటలు పట్టేశాయి. ఇంకేమి ఆలోచించకుండా అతని వెనకే బయల్దేరాడు.

చందూ హాస్పిటల్‌లో అడుగుపెడుతూనే ఎదురుగా వస్తున్న డాక్టర్ని అడిగాడు.

"డాక్టర్ మా అమ్మకి ఎలా వుంది?"

"ప్రస్తుతానికి ప్రమాదం ఏమీ లేదు చందూ మరో సారి స్ట్రోక్ వస్తే చాలా ప్రమాదం. ఆవిడ నిన్ను చూడాలని కలవరిస్తున్నారు వెళ్ళి కలు" అంటూ ముందుకి సాగిపోయాడు డాక్టర్.

చందూ వార్డ్‌లోకి అడుగు పెట్టగానె అతని తల్లి చందూని చూసి "బాబు చందూ వచ్చావా నీకోసమెరా చూస్తుంది" అంది.

"ఇప్పుడెలా ఉందమ్మా."

"పర్వాలేదురా! బాబు చందు నా చివరికోరిక ఒకటుంది తీరుస్తావా?"

"ఏమిటమ్మా అది"

ఆమె ఒక్కసారిగా గట్టిగా ఊపిరి పీల్చుకొని చెప్పటం మొదలుపెట్టింది.

"విజయవాడలో మా అన్నయ్య అదే మీ

మావయ్య వున్నాడు తెలుసుగా వాడి కూతురు రేఖని నువ్వు పెళ్ళి చేసుకోవాలి! నేనింకా ఎక్కువ కాలం బతకననిపిస్తుంది. ఇంతకాలం దూరంగా



వున్న మన బంధుత్వం నీ ద్వారా దగ్గిర కావాలి రేఖని పెళ్ళి చేసుకుంటావు కదూ" అంది.

"అది కాదమ్మా ఇప్పుడు అవన్నీ ఎందుకూ నువ్వు త్వరగా కోలుకున్నాక చూద్దాం" అన్నాడు చందూ.

"అది కాదురా చాలా తొందర్లో నీ పెళ్ళి జరిగిపోవాలి నీ పెళ్ళి చూసి నేను కన్ను మూయాలి."

"అమ్మా నేనూ......" అంటూ ఏదో చెప్పబోయిన చందూ మాటలకు ఆమె అడ్డు వస్తూ.

"ఇంక నువ్వేం చెప్పకురా తెల్లారే లోగా నీ నిర్ణయం చెప్పాలి నువ్వు కాదంటె రెండో రోజే తెల్లారకుండానే...."

"అంతమాటనకమ్మా నువ్వు చెప్పినట్టుగానె రేఖని పెళ్ళి చేసుకుంటాను." అ మాటల్ని అంటున్నప్పుడు చందూ గొంతువొణికింది.

చందూ గదిలో ఒంటరిగా కూర్చొని వున్నాడు అతని మనసులో చెప్పలేని వేదన ముసురుకుంది. స్వప్నని చూడనిదే కనీసం క్షణమైనా గడపలేని తను శాశ్వతంగా స్వప్నకి దూరం కావటం ఇష్టం లేని అతని మనసు పెట్టె బాధని భరించ లేకపోతున్నాడు.

అతను స్వప్నని దూరం చేసుకోలేడు.

అలాగని తన తల్లిని చంపుకోలేడు.

ఏం చేయాలి....?

ఈ సమస్యకి పరిష్కారం ఏమిటి......??

రేపు స్వప్న నన్నెందుకు మోసం చేశావంటె తనేం జవాబు చెబుతాడు. తనని ఎంతో ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన స్వప్న తనని మోసగాడు అంటె తను తట్టుకోగలడా.

చందూ ఆలోచించి..... ఆలోచించి చివరికి తన మనసుని చంపుకొని తల్లిప్రేమకి తలొంచి రేఖ మెళ్ళొ మూడు ముళ్ళు వేశాడు.

అందమైన పువ్వులతొ అలంకరించిన మంచంపై చందూ కూర్చొని వున్నాడు. అక్కడే వున్న బెడ్ లైట్ స్విచ్‌ని చేతిలోలోకి తీసుకొని ఆన్ ఆఫ్ చేస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు.

ఇంతలో రేఖ పాలగ్లాసుతొ ఆ గదిలోకొచ్చి పాల గ్లాసుని చందూకి అందించింది. చందూ పాల గ్లాసు అందుకొని పక్కనే వున్న టేబుల్ మీద పెట్టాడు.

రేఖ వచ్చి అప్పటికే పది నిమిషాలు గడిచిపోయాయి. అయినా చందూ ఆమెను పలకరించనూ లేదు కనీసం తలెత్తి అయినా చూడలేదు.

"ఏమిటి బావా ఆలోచిస్తున్నావు?" కొంత సేపటి తర్వాత రేఖే అడిగింది.

చందూ తలెత్తి ఆమె కళ్ళల్లోకి చూశాడు. తనని నమ్మి తనతో జీవితాంతం తోడుంటానని వచ్చిన ఆమెకు తన 'మనసు గతి' ఎలా చెప్పాలో తెలీ లేదు చందూకి.

ఒకవేళ చెబితె ఆమె భరించగలదా?

అందుకే చందూ బాగా ఆలోచించి రేఖా నా మనసేమి బాగో లేదు! కొంత కాలం మనం దూరంగా వుందాము నన్నర్థం చేసుకుంటావా? అడిగాడు.

రేఖ ఏమనుకుందో ఏమో "అలాగే బావా" అంది పొడిగా.

చందూ ఊపిరి పీల్చుకున్నాడు. రేఖ కాబట్టి సరిపోయింది అదే ఆమె స్థానంలో మరోకామె ఉంటె తనని అపార్థం చేసుకొని గొడవ గొడవ చేసేదమో అనుకున్నాడు.

అలా చందూ రేఖకి దూరంగా ఉంటూ వచ్చాడు. అయినా అతని ఆలోచనల్లో మార్పు రాలేదు. ప్రతిక్షణం స్వప్న గుర్తుకు వస్తూనే వుంది. స్వప్న జ్ఞాపకాలు అతని యదని గులాబి ముళ్ళై గుచ్చసాగాయి.

ఎంత మరువాలన్నా మరిచిపోలేనిది ఆమె ప్రేమ. గతం మధురంగా అతన్ని కట్టిపడేసింది.

అలా స్వప్న ఆలోచనలతో అతను పిచ్చి వాడైపోయాడు.

రేఖతొ మాత్రం పొడి పొడిగానే మాట్లాడుతున్నాడు. ఇది వరకటి ఉత్సాహం. సంతోషం అతని కళ్ళల్లో మచ్చకైన కనిపించటం లేదు.

మనిషి 'మనసు' అధీనమై పూర్తిగా మారిపోయాడు. షేవింగ్ చేసుకోవాలనే ధ్యాస, అందంగా డ్రస్ వేసుకోవాలనె ఆశ ఏనాడో మరిచిపోయాడు.

లోతుగా వెళ్ళి పోయిన అతని కళ్ళల్లో ప్రతిక్షణం స్వప్న రూపం కదలాడుతూ అతన్ని మరింత కృంగ దీసింది.

కాలం అతనికి సాయం రానట్టుగా, మరణం అతన్ని చేరుకోనట్టుగా ఎప్పుడూ శూన్యంలోకే చూస్తూ ఉండిపోసాగాడు.

చెప్పినట్టుగానే పదిహేను రోజుల తర్వాత స్వప్న, చందూ కోసం సముద్ర తీరానికి వచ్చి అతని కోసమె ఎదురు చూడసాగింది.

వొంటరిగా వచ్చిన స్వప్నని చూసి సముద్రం ఆశ్చర్యపోయినట్టుగా ఆమెను పలకరించింది.

చాలా సేపటి వరకూ ఎదురు చూసినా చందూ రాకపోవటంతో స్వప్న ఆశ్చర్యపడింది. చందూని చూడాలని ఆమె మనసు ఉబలాట పడుతుంది. అయినా అతని జాడ లేదు.

ఇలా ఎందుకు జరిగింది.

ఒకవేళ చందూ మరిచిపోయి వుంటాడా అనుకుంది. కానీ అంతలోనే అలా జరగటానికి వీల్లేదు చందూ తనని మరిచిపోడు ఆ నమ్మకం తనకుంది.

చందు కోసం ఎదురు చూసి.... చూసి.... బరువెక్కిన హృదయంతో తిరిగి వెళ్ళిపోయింది స్వప్న.

అలా రోజూ ఒంటరిగా రావటం ఒంటరిగా వెళ్ళిపోవటం. కాల గర్భంలో స్వప్న వియోగం రెండు నెలలుగా గడిచిపోయాయి.

ఆమె మనసు మూగ బోయింది. అతని కోసం చూసి చూసి స్వప్న కళ్ళు అలసిపోయాయి. ఇలా ఎందుకు చేశాడు? తనని ఇంత నరకంలో వొదిలి అతను ఎక్కడికెళ్ళాడు?

తనని చూడనిదే క్షణమైనా ఉండలేని చందూనే ఇలా చేశాడంటె ఆమె మనసు మాత్రం నమ్మటం లేదు.

ఏదో జరిగింది? ఏం జరిగింది?

అలాంటి ఆలోచన్లతో ఆమె కళ్ళల్లోంచి అశ్రుకణాలు జారి ఆ సముద్రంలో కలిసిపోయాయి.

చందూని చూడాలనే ప్రేమ పిచ్చిలో ఓ రోజు అతను పనిచేసే ఆఫీసుకు ఫోన్ చేసింది.

'చందూకి పెళ్ళి జరిగినప్పటి నుండి ఆఫీసుకి సరిగా రావటం లేదు'ని అటునుండి ఎవరో చెప్పారు.

అంతే ఆమె గుండె పగిలి ముక్కలైపోయింది.

చందూ ఓ విధంగా పిచ్చివాడై పోవటం చూసి అతని మనసులో ఏముందని అడిగి.... అడిగి అలసిపోయి చివరకు కన్న కొడుకు అలా అవటం చూసి భరించలేక అతని తల్లి కన్ను మూసింది.

ఆ బాధతో మరింత కృంగిపోయాడు చందూ ఇదివరకు రేఖతో కొద్దో, గొప్పో, మాట్లాడేవాడు ఇప్పుడు అసలు మాట్లాడటమే మానేశాడు.

తన కాపురం ఇలా అవటం చూసి సహించలేని రేఖ తన బాధని తండ్రికి విన్నవించుకుంది.

చివరికి రేఖ తండ్రి ఓ నిర్ణయానికి వచ్చి

'మగాడు మౌనంగా ఉన్నా ఆడది అతిగా మాట్లాడినా' అపార్థం చేసుకునే ఈ సమాజంలో తన కూతురిని బలి పెట్ట దలుచుకోలేదని.

'ఇష్టం లేని వాళ్ళతో కాపురం కష్టంగా వుంటే విడిపోవటమె మంచిదని' తలచి తెగ తెంపులు చేసుకొని రేఖను తీసుకొని విజయవాడ వెళ్ళిపోయాడు.


తనతో విధి ఇంత విచిత్రంగా ఆడిన నాటకంలో చందూ ఏలాగూ అయిపోయాడు. తనకింక బ్రతుకుమీదే విరక్తి కలిగింది. ఇన్ని బాధలు భరించలేక చివరికి చావటానికి కూడా సిద్ధమయ్యాడు.

స్వప్న జ్ఞాపకాలతో అది కూడా సాధ్యంకా లేదు. చివరికి ఓ నిర్ణయం ఆలోచించుకున్నాడు. స్వప్నని కలవాలి తన ఇన్నాళ్ళు ఎడబాటుకి కారణం చెప్పాలి తన బాధని అర్థం చేసుకొని మళ్ళీ స్వప్న చేరువైతే తను మామూలు మనిషవుతాడు.

చివరికి స్వప్న కూడా కాదంటె ఎడారిలో కోయిలై మిగిలిపోతాడు.

చందూ జ్ఞాపకాలని మరిచిపోలేని స్వప్న ప్రతి రోజు సముద్ర తీరం వచ్చి అతని ధ్యానంలోనే గడపసాగింది. అతను మోసం చేశాడంటె ఆమె నమ్మలేకపోతుంది.

చందూని మరిచిపోవాలని చాలా సార్లు అనుకుంది. కాని సాధ్యపడటం లేదు. ప్రతి రోజు లాగే ఆ రోజు కూడా సముద్ర తీరానికి వచ్చి మోకాళ్ళ మీద తలపెట్టి మౌనంగా రోదిస్తూ సముద్రం వైపు చూడ సాగింది.




ఆమె కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరుగుతూ చెంపల మీద నుండి జారి సముద్రంలో కలిసి పోతున్నాయి.

నెమ్మదిగా భుజం మీద చేయి పడటంతో ఉలిక్కి పడింది. ఆ చేతి స్పర్శలో ఏదో తెలియని అనుబంధం వుంది. తల తిప్పి చూసింది. చందూ..... మనిషి పూర్తిగా రూపు రేఖలు లేకుండా ఉన్నాడు.

అయినా ఆ క్షణం అతను మోసం చేశాడని గుర్తుకు రాగానె ఆమె కళ్ళల్లో ఎర్రటి జీరలు చోటు చేసుకున్నాయి.

చందూ ఆమె కళ్ళలో భావాలు అర్థం చేసుకుంటూ....

"స్వప్న నాకు తెలుసు నేనంటె నీకు అసహ్యం అని అయినా మన ప్రేమని మరిచిపోలేక చివరి సారిగా నీతో పదినిమిషాలు మాట్లాడాలని వచ్చాను" అతని గొంతు వేదనగా పలికింది.

"ప్రేమా..... నీలాంటి మోసగాళ్ళకి అందని పవిత్రమైన భావనలిది. ఇంకా ఆ పదాన్ని పలికి అపవిత్రం చేయకు" కోపంగా అంది స్వప్న.

"స్వప్న ప్లీజ్.... అలా అనకు నేను భరించలేను. ఒక్క పదినిమిషాలు నేను చెప్పే మాటల్ని విను ఆ తర్వాత నీ ఇష్టం" అంటూ ఆమె వెళ్ళిన తర్వాత సంఘటనలన్నీ పూర్తిగా చెప్పాడు.

చెప్పి నిలబడటానికి కూడా ఓపిక లేనట్టుగా ఇసుకలో కూలబడిపోయాడు. అతడి కళ్ళు కన్నీటితో నిండిపోయాయి. ఆ తర్వాత మళ్ళీ చెప్పటం మొదలుపెట్టాడు.

"స్వప్న తెలిసి..... తెలిసి నేనే తప్పు చేయలేదు. జరిగింది మాత్రం ఇది. నేనింకా బ్రతికి ఉన్నానంటె కేవలం నీ కోసం.... నీ ప్రేమ కోసం, అందుకే చావబోయే ముందు నిన్ను చూడాలనె తాపత్రయంతొ వచ్చాను.

నువ్వు నన్ను అర్థం చేసుకుంటే చాలు. అందుకే చివరి నిర్ణయం నీకు వొదిలేస్తున్నాను. నేనంటె నీకు అభిమానం ఉందో లేదో చెప్పు, ఇప్పుడు.... కాదు రేపు..... అంటె ఇరవై నాలుగ్గంటలు తర్వాత ఇదే సమయానికి మన కిష్టమైన ఈ సముద్ర తీరంలో....

నువ్వు అభిమానంతో నీ స్నేహ హస్తాన్ని అందిస్తే నావంటి అదృష్టవంతుడు ఈ ప్రపంచంలో ఎవరూ లేరని భావిస్తాను.

లేకుంటె.... కాదు.... కాదు ఈ లోకం నుండే శాశ్వతంగా వెళ్ళిపోతాను." అంటూ పైకి లేచి సముద్ర తీరం గుండా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

స్వప్న చందూ వెళ్ళిన వైపే చూస్తూ ఉండిపోయింది. ❋